జోరు వానతో కష్టాలు

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- నీట మునిగిన పంటలు


తిర్పెల్లి వాగు వద్ద మాట్లాడుతున్న ఎస్సై సుమలత


కుభీర్‌లోని మేదరివాడలో ఇళ్ల చుట్టూ చేరిన వరద

తానూరు: భారీ వర్షాలకు గ్రామాల్లో వాగులు, కుంటలు పొంగిపొర్లాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు కురిసిన వర్షంతో వందల ఎకరాల పంటల్లో నీరు నిలిచింది. ఝరి(బి) వంతెనపై వరద ప్రవహించడంతో ఝరి(బి), ఝరి(బి)తండాతోపాటు మహారాష్ట్రలోని బోధి, తురాటి, ఉమ్రి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ లింగంమూర్తి, ఎంపీడీవో అబ్దుల్‌సమద్, ముథోల్ సీఐ మల్లేశ్, ఎస్సై సందీప్ వంతెనను పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

లక్ష్మణచాంద: అత్యవసరమైతే తప్ప మండల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ఎస్సై సుమలత కోరారు. భారీవర్షాలు కురుస్తున్నందున ఆదివారం ఎస్సై సిబ్బందితో కలిసి పలు గ్రామాలను సందర్శించారు. తిర్పెల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును పరిశీలించి జాగ్రత్తగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో పీసీలు అశోక్, కిరణ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలో శనివారం రాత్రి ప్రారంభమైన వర్షం ఆదివారం రోజంతా కురిసింది. దీంతో మండలంలోని వాగులు పొంగిపొర్లగా.. చెరువుల అలుగుల నుంచి నీరు మత్తడి దూకింది.

లోకేశ్వరం: వర్షాలకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పంచగుడి సమీపంలోని వంతెన వద్ద గోదావరి నిండుగా పారుతోంది. ధర్మోర పెద్దచెరువు నిండి గోదావరిలోకి చేరుతోంది. పత్తి, మొక్కజొన్న, పసుపు పంటల్లో నీరు నిలిచింది.


తానూరు మండలంలోని ఝరి(బి) వంతెనను పరిశీలిస్తున్న అధికారులు

ముథోల్: వర్షాలకు మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముథోల్‌లోని సాయిమాధవ్ కాలనీలో ఇళ్లలోకి వరద వెళ్లింది. తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్‌ఐ నారాయణపటేల్, ఇతర సిబ్బంది కాలనీలో మొరం పోయించి మరమ్మతులు చేయించారు. మహాత్మా జ్యోతి బా పూలే పాఠశాలకు వరద చేరడంతో 5,6,7 తరగతుల విద్యార్థులకు సెలవు ప్రకటించారు. తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు. అంతకుముందు అధికారులు జ్యోతి బాపూలే హాస్టల్‌కు వచ్చి విద్యార్థులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నారు.

కుభీర్‌లో..

కుభీర్: ఎడతెరిపి లేని వర్షానికి కుభీర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వరద చుట్టుముట్టింది. అలాగే మేదరివాడలో పలువురి ఇళ్లలోకి వరద చేరింది.


ముథోల్ జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థులను ఇంటికి తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

దార్‌కుభీర్, బెల్గాం వంతెనపై నుంచి వరద వెళ్లడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. డీఎల్‌పీవో సుధాకర్‌పటేల్, తహసీల్దార్ ఎం.సోము, ఎంపీడీవో మోహన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ తదితరులు పరిస్థితులను పర్యవేక్షించారు. మేదరివాడ గ్రామస్తులకు ఉర్దూ మీడియం పాఠశాలలో రెండు గదులు కేటాయించినట్లు డీఎల్‌పీవో తెలిపారు.


లోకేశ్వరం: ధర్మోరలో చెరువు అలుగు

తొమ్మిది గ్రామాలకు నిలిచిన రాకపోకలు

కుంటాల: మండలంలోని గ్రామాల్లో లోతట్టు వంతెనల పైనుంచి వరద ప్రవహించడంతో ఆదివారం 9 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తవెంకూర్ నుంచి పాత వెంకూరు గ్రామానికి వెళ్లే లోలెవల్ వంతెనపై వరద ప్రవహించడంతో పాతవెంకూర్, విఠాపూర్, పెంచికల్‌పాడ్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఓలా శివాలయం సమీపంలో లోలెవల్ వంతెనపై వరద ప్రవహిస్తుండటంతో సూర్యాపూర్, మెదన్‌పూర్, అంబుగామ, రాజాపూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.ఓలా నుంచి లింబా(బి) గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై వరద ప్రవహించడంతో లింబా(కె), లింబా(బి) గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఎంపీడీవో ఎంఏ రహీం, డీటీ నరేశ్‌గౌడ్, ఎస్సై సీహెచ్.భాస్కరాచారి, ఆర్‌ఐ అడెల్లు లోలెవల్ వంతెనలను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా సూచికలు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేశారు. ఆదివారం ఉదయం ఓలా మీదుగా లింబా(బి) వెళ్తుండగా లోతట్టు వంతెనపై వరదతో మూడు గంటలపాటు ఆర్టీసీ బస్సును నిలిపివేశారు. మండలంలో 8సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయికృష్ణ తెలిపారు.


సూర్యాపూర్ శివారులో కోతకు గురైన రోడ్డు

కొత్తవెంకూర్‌కు చెందిన మంగలి భూమన్న పాత వెంకూర్ శివారు వాగు సమీపంలో తన చేను వద్ద భార్యతో కలిసి నివాసం ఉంటున్నారు. వెంకూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఎంపీడీవో రహీం, ఎస్సై భాస్కరాచారి, ఆర్‌ఐ అడెల్లు.. భూమన్న వద్దకు వెళ్లి ఆయనతోపాటు పశువులను అక్కడి నుంచి తరలించేందుకు చర్యలు చేపట్టారు.


పాతవెంకూర్ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద

ఏ పంట.. ఎంత?

- క్లస్టర్ల వారీగా వ్యవసాయాధికారుల సర్వే
- క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ
- సర్వేనంబర్ల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు
- ఇప్పటి వరకు 65శాతం పూర్తి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో సాగు చేస్తున్న పంటల వివరాల నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు ముమ్మరం చేశారు. ఏయే రైతు ఎన్ని ఎకరాల్లో ఏ పంటలు పండిస్తున్నారో వివరాలు సేకరిస్తున్నారు. అధికారులు వ్యవసాయ క్షేత్రాల్లో పరిశీలించి.. సర్వేనంబర్ల వారీగా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ సర్వేతో ప్రభుత్వానికి కచ్చితమైన సమాచారం తెలుస్తుంది. ఈ జాబితా ఆధారంగా అన్నదాతలకు రైతుభరోసా, రైతు బీమా తదితర ప్రభుత్వ పథకాలు అందనున్నాయి. ఇందులో రైతులు వివరాలు నమోదు చేసుకుంటే చేతికొచ్చిన పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు ఇబ్బంది ఉండదు. ఇప్పటివరకు జిల్లాలో పంటల వివరాల నమోదు ప్రక్రియ 65 శాతం మేర పూర్తయింది. అత్యధికంగా వరి, తర్వాత పత్తి సాగు చేస్తున్నారని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు ..

గతంలో అధికారులు ఒకే చోట కూర్చొని కొందరు రైతుల నుంచి సేకరించేవారు. దీంతో పంట చేతికొచ్చిన తర్వాత(మార్కెట్ సీజన్‌లో) సాగు లెక్కల్లో వ్యత్యాసం కనిపించేది. కానీ కొన్నాళ్లుగా పంటల వివరాలు పారదర్శకంగా నమోదు చేస్తున్నారు. ప్రతి పంట క్షేత్రానికి అధికారులు వెళ్లి పట్టాదారు పాసుపుస్తకం, సర్వేనంబర్ల వారీగా ఏ రకమైన పంటలు ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారనే విషయాలు సేకరిస్తు న్నారు. అనంతరం ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. దీంతో రెవెన్యూ గ్రామాల వారీగా ఎన్ని ఎకరాల్లో పంటలు పండిస్తున్నారో లెక్కలు పక్కాగా తెలుస్తాయి.


సోన్ మండలం న్యూవెల్మల్‌లో పంటల వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో (ఫైల్)

పక్కాగా లెక్కలు..

జిల్లాలో ఈవానాకాలం సీజన్లో మొత్తం 4,32,000 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. వీటిలో వరి 1,35,000, పత్తి, 1,68,000 ఎకరాల్లో సోయాబీన్ 1,01,000 ఎకరాల్లో మొక్కజొన్న 18,000 ఎకరాల్లో కందులు 10,000 ఎకరాల్లో పండించనున్నట్లు అంచనా వేశారు. ఇప్పటివరకు 2,77,824.07 ఎకరాల్లో (65శాతం) సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయశాఖ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇంకా 1,54,175.93 ఎకరాల్లో సాగుచేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంది. ప్రస్తుతం పకడ్బందీగా పంటల సర్వే చేపడుతున్నారు.

ఇప్పటివరకు నమోదు చేసిన వివరాలు

పంట పేరు	పట్టాదారులు	విస్తీర్ణం (ఎకరాల్లో)
వరి	39,241	60,962.14
జొన్న	35	54.38
మొక్కజొన్న	7,829	10,715.17
పత్తి	47,121	1,11,023.13
సోయా	37,217	87,476.37
మినుములు	156	159.33
పెసలు	211	150.10
కందులు	13,375	7,205.32

వివరాల నమోదు ఇలా..

జిల్లాలో వ్యవసాయశాఖ ద్వారా క్లస్టర్ల వారీగా పంటల సర్వే చేపడుతున్నారు. ప్రతి రైతు వ్యవసాయ క్షేత్రానికి ఏఈవోలు వెళ్తున్నారు. అక్కడ ఆ రైతు ఏయే సర్వే నంబర్లలో ఏ పంటలు, ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు.. రైతు పేరు, ఊరు, భూమి, బోరుబావులా, సాగునీటి సౌకర్యం ఉందా అనే వివరాలను పక్కాగా నమోదు చేస్తున్నారు. ట్యాబ్‌లో నమోదు చేసి ఫీల్డ్ నుంచే ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయానికి పంపిస్తున్నారు. దీంతో పంటల దిగుబడి ఎంత వస్తుంది. మార్కెట్ సీజన్‌లో ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకునేందుకు ఉపయోగపడుతుంది.

సంక్షిప్త వార్తలు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కుంటాల: ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సహకారంతో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం పేర్కొన్నారు. ఆదివారం కుంటాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవించామన్నారు. దీనిపై కొందరు నాయకులు పనిగట్టుకొని అధికారులు నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపణ చేయడం సరికాదన్నారు. నాయకులు పసుల నవీన్, కట్ట రవి, వెంకట్‌రావు, గౌస్, రమణారావు, సాదు ప్రభాకర్, గోవర్ధన్, మహేందర్, వెంకటేశ్, విఠల్ పాల్గొన్నారు.

పరామర్శ

కుంటాల:మండలంలోని అంబకంటి చెందిన రాజశేఖర్‌రావు తండ్రి ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యులను ఆదివారం కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి పరామర్శించారు. నర్సారెడ్డి, కొట్టే హన్మాండ్లు, ధర్మాగౌడ్, దేవి దాస్, నరేందర్, భీమేందర్, హైమద్ ఉన్నారు.

కడెం: మండలంలోని కన్నాపూర్ జీపీ పరిధిలోని చిన్నక్యాంప్ గ్రామానికి చెందిన కాశిపాక నాగేశ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్ రెడ్డి, సంపత్‌రెడ్డి పరామర్శించారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పెద్దూర్‌కు చెందిన అపావత్ నర్సింగ్ ఎద్దు ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని.. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలి

లోకేశ్వరం: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతుల ప్రతిమలను ప్రతిష్ఠించాలని మా అమ్మ–నాన్న ఫౌండేషన్ చెర్మన్ మాదిరి ఆంజనేయులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించే వారికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారాలు అందిస్తామని పేర్కొన్నారు.

కరాటే పోటీల్లో సత్తా


పతకాలతో విద్యార్థులు

సోన్: హైదరాబాద్ కండ్లకోయలో ఆదివారం నిర్వహించిన ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్–2024 పోటీల్లో మండలకేంద్రంలోని అభ్యాస గురుకులం విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కటాస్ విభాగంలో గుమ్ముల శైలజ బంగారు, అరేపల్లి వర్షిని, ఇందూరి సంజయ్ వెండి పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు.

పరీవాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

సోన్: నిర్మల్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సోన్ మండల ఆర్‌ఐ రఫీక్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్టు వద్దకు చేపల వేటకు, పశువులను మేపేందుకు వెళ్లొద్దని సూచించారు.

ప్రభాకర్ మహరాజ్ పుణ్యతిథి

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయ ఆవరణ ధ్యాన మందిరంలో ఆదివారం ప్రభాకర్ మహరాజ్ 16వ పుణ్యతిథి నిర్వహించారు. వారి శిష్యులు మాట్లాడుతూ సాయిబాబా ఆలయ అభివృద్ధికి ప్రభాకర్ మహరాజ్ కృషి చేశారని పేర్కొన్నారు. అభిషేకం, అలంకరణ, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

'పొలాల' పండుగ


పూజలు చేస్తున్న భక్తులు

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామంలో ఆదివారం పొలాల అమావాస్య పండుగ నిర్వహించారు. రైతులు ఉదయం ఎద్దులను చెరువుల వద్దకు తీసుకెళ్లి స్నానం చేయించి అలంకరించారు. హనుమాన్ ఆలయాల చుట్టూ ఎడ్లను తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

గజ్జలమ్మదేవికి పూజలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గజ్జలమ్మకు అభిషేకం, అలంకరణ, అర్చన, పల్లకిసేవ చేశారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడి సస్పెన్షన్

భైంసాటౌన్: బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు బాలాజీ సూత్రావేపై ఆ పార్టీ క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి ప్రకటించారు. పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరించినందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఓ ప్రకటనలో కోరారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్తు

కుంటాల: కష్టపడి చదివితే ఉన్నత భవిష్యత్ ఉంటుందని పలువురు పేర్కొన్నారు. గురుకుల పీఈటీ ఫలితాల్లో కుంటాలకు చెందిన సబ్బిడి దేవేందర్, ఎనుగందుల సాగర్ ఉద్యోగాలు సాధించారు. అలాగే ఇటీవల ఉత్తమ అవార్డు అందుకున్న కుంటాల కార్యదర్శి రాజ బాపును ఆదివారం కుంటాలలో మాజీ ఎంపీపీ జీవీ అరుణ రమణారావు సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు రమేశ్‌గౌడ్, గోపిచంద్, గజ్జారాం, నర్సాగౌడ్, జక్కని గజేందర్, శివ, రాజు, రమేశ్, సురేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భైంసాటౌన్: భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ సూచించారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సహాయ చర్యలు చేపట్టేందుకు వైద్యసిబ్బందితోపాటు అన్నిశాఖల అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా సంబంధిత అధికారులు, వర్షపు నీరు ఇళ్లలోకి చేరకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి తాగు నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, అవసరమైతే తనను ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

ఖానాపూర్: భారీవర్షాల నేపథ్యంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సూచనలతో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశామని.. ఇబ్బందులుంటే ప్రజలు 96666 93594, 99480 45865 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

లక్ష్మణచాంద: భారీ వర్షాలు ఉండటంతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అత్యవసరమైతేనే బయటకు రావాలని ఎంపీడీవో రాధ సూచించారు. ఆదివారం మండలంలోని కనకాపూర్, వడ్యాల్, రాచాపూర్ గ్రామాల్లో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులుంటే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్లు


మైనార్టీ స్కూల్ వద్ద కొట్టుకుపోయిన రోడ్డు పరిశీలిస్తున్న అధికారులు, నేతలు


కొత్తగూడెం మార్గంలో నిలిచిన రాకపోకలు

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్, గాంధీనగర్ శివారులో రెంకోనివాగుపై వంతెన నిర్మాణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్లు భారీ వర్షాలకు కొట్టుకుపోయాయి. దీంతో 20 నుంచి 30 గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని మైనార్టీ స్కూల్‌కు వెళ్లే తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. కొట్టుకుపోయిన రోడ్డును ఎస్సై లింబాద్రి, మున్సిపల్ కమిషనర్ మనోహర్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, నయీం, సలీంఖాన్ పరిశీలించారు.

కొత్తగూడెం గ్రామానికి నిలిచిన రాకపోకలు

భారీవర్షాలతో ఖానాపూర్ మండలంలోని అడవిసారంగాపూర్ పంచాయతీ పరిధిలో ఉన్న కొత్తగూడెం గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. అటవీ ప్రాంతం నుంచి వరద వస్తుండడంతో గ్రామస్తులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

బాధిత కుటుంబాలకు మిత్రుల అండ


ఓలాలో ప్రకాశ్ భార్యకు నగదు అందిస్తున్న పదో తరగతి పూర్వ విద్యార్థులు


అంబకంటిలో మల్లేశ్ కుటుంబానికి సాయం అందిస్తున్న పూర్వవిద్యార్థులు

కుంటాల: వివిధ కారణాలతో స్నేహితులు మృతి చెందగా.. వారితో కలిసి చదువుకున్న మిత్రులు బాధిత కుటుంబాలకు అండగా నిలిచి ఆదివారం ఆర్థికసాయం అందించారు. కుంటాల మండలం ఓలా గ్రామానికి చెందిన ప్రకాశ్ ఇటీవల మృతి చెందాడు. ఆయనతో కలిసి ఓలా గ్రామ ఉన్నత పాఠశాలలో 2004–05లో పదోతరగతి చదివిన విద్యార్థులు రూ.52వేలను పోగు చేసి ప్రకాశ్ భార్య రీనారాణికి నగదు అందజేశారు.

అలాగే అంబకంటి గ్రామానికి చెందిన సీహెచ్.మల్లేశ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. అతడితో కుంటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2008–09లో పదోతరగతి చదివిన విద్యార్థులు రూ.21వేలను జమ చేసి మృతుడి భార్య ప్రతిభకు అందించి స్నేహభావం చాటారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పండుగలా సభ్యత్వ నమోదు నిర్వహించాలి

సారంగాపూర్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామాల్లో పండుగలా నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మ రాజు అన్నారు. మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలోని ఆదిత్య గార్డెన్‌లో మండలంలోని బీజేపీ నాయకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రతి బూత్‌లో 200 మందిని పార్టీ సభ్యులుగా చేర్పాలని పేర్కొన్నారు. 88000 02024 నెంబర్‌కు మిస్‌కాల్ చేసి సభ్యత్వం నమోదు చేయించుకోవాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు విలాస్, సభ్యత్వ నమోదు కన్వీనర్ రాంరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చాణక్య, రాంశంకర్ రెడ్డి, మంతెన గంగారెడ్డి, రాజేందర్‌రెడ్డి, సాహెబ్ రావు, బ్యాగరి ఎల్లన్న, కొరిపెల్లి రాజు, రాజారెడ్డి, భోజన్న, ఈర్ల చిన్నయ్య తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజు

21ఏళ్లకు కలిసిన వేళ


లక్ష్మణచాందలో సమావేశమైన 2002-03 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002–03లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం లక్ష్మణచాందలోని రాధాకృష్ణ ఫంక్షన్‌హాలులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 21 ఏళ్లకు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకొని సంతోషంగా గడిపారు. ముందుగా తమకు విద్యాబుద్ధులు నేర్పించి తమ ఉన్నతికి కారకులైన గురువులను సన్మానించారు. పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్‌కు చెందిన చిలుకూరి రాములు అనే ఉపాధ్యాయుడి ఉద్యోగ విరమణ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, పలువురు వారిని సన్మానించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.